క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్: తెలంగాణ గురుకుల పాఠశాలలు/ప్రతిభ జూనియర్ కళాశాలల్లో (పీటీజీ) చెంచు విద్యార్థులు ఈ నెల 6వ తేదీన నేరుగా (స్పాట్) ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పీటీజీ పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్ననూర్‌లోని పీటీజీ పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, మన్ననూర్ కళాశాలలో సీఈసీ, హెచ్ఈసీలో చెంచు విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు ఇతర గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడుతాయని పేర్కొన్నారు. వివరాల కోసం సెల్: 9490957314-8333925372 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా బోనాల వేడుకలు



లింగాల: మండలంలోని దారారంలో మూడు రోజులుగా నిర్వహించిన బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు గ్రామ దేవతకు శక్తి పూజలు నిర్వహించారు. భక్తులు గ్రామ దేవతలకు వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అలంకరించిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామ పొలిమేరలో ఉన్న గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. మూడు రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ సర్పంచు కవిత, శ్రీనివాస్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోడేరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీ, రామాలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు కృషితో గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ కరీం, పాండేళ్ల సురేష్‌యాదవ్, ఆదిరాజు, జగన్, గణేష్, రామకృష్ణ, శరత్, సొప్పరి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం




చారకొండ: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు వైద్యాధికారులు, సిబ్బందితో యోగావాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగాలో భాగస్వామ్యం కావాలన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చారి, మేషక్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు తదితరులు ఉన్నారు.

అవగాహన ర్యాలీ

మన్ననూర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ, ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ఆసనాలు వేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుధాకర్, జాన్సన్‌లతో పాటు సురేష్, పద్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ కోరారు. మంగళవారం మండలంలోని రఘుపతి పేటలో ఆయన పర్యటించారు. మండలంలో మోడల్ గ్రామంగా ఎంపికైన ఆ గ్రామంలో పర్యటించి 10 ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులతోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని అప్పులు చేయొద్దని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సంగప్ప, డీఈ హర్యానాయక్, ఎంపీడీఓ వెంకట రాములు, పంచాయతీ కార్యదర్శి భారతమ్మ లబ్ధిదారులు ఉన్నారు.



నాగర్‌కర్నూల్ మండలం పర్వతాయపల్లిలో



కల్వకుర్తిలో



కోడేరు మండలం బావాయిపల్లిలో..

ఊరూరా రెవెన్యూ సదస్సులు

సాక్షి, నెట్‌వర్క్: భూ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం పకడ్బందీగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

■ నాగర్‌కర్నూల్ మండలంలోని నాగదేవ్‌పల్లి, పర్వతాయపల్లి గ్రామాల్లో నిర్వహించిన అధికారులు రెవెన్యూ సదస్సులకు ఆర్డీఓ సురేష్ హాజరయ్యారు. రెండు గ్రామాల నుంచి 26 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జయంతి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ మండలంలోని నర్సింగరావుపల్లి, తాళ్లనరసింహాపురం గ్రామాల్లో ఆర్డీఓ బన్సీలాల్ రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. మొత్తం 17 దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, ఆర్ఐ జానయ్య, సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం హాజరయ్యారు. ఎల్లికల్‌లో 51 దరఖాస్తులు, కురుమిద్దలో 21 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలోని బచారంలో రెవెన్యూ సదస్సును ఆర్డీఓ బన్సీలాల్ పరిశీలించారు. దేవినేనిపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్ పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో 57 దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

■ కోడేరు మండలంలోని బావాయిపల్లిలో రెవెన్యూ సదస్సును ఆర్డీఓ బన్సీలాల్ సందర్శించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, మాలతి, మహేష్, నర్సింహ పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి బాచారంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

■ ఉప్పునుంతల మండలంలోని ఉప్పరిపల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సులో అచ్చంపేట ఆర్డీఓ మాధవి పాల్గొన్నారు. 31 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మార్వో సుజాత, మాజీ జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, రెవెన్యూ సిబ్బంది అబ్రహం, రమణమ్మ, ఆధిత్య, రైతులు పాల్గొన్నారు.

■ బల్మూర్ మండలంలోని పోలేపల్లి, గణేష్‌పూర్ గ్రామాల్లో 21 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కేశవులు, ఆర్ఐలు పద్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

■ చారకొండ మండలంలోని కమాల్‌పూర్, శేరిఅప్పారెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాల్లో భూసమస్యలపై సదస్సులను నిర్వహించారు. కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను సదస్సులను పరిశీలించారు. శేరిఅప్పారెడ్డిపల్లిలో 38, కమాల్‌పూర్‌లో 25 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ సునీత తెలిపారు.

■ లింగాల మండలంలోని వల్లభాపూర్, మానాజీపేట, రాయవరం గ్రామాల్లో భూ భారతి గ్రామ సభలను నిర్వహించారు. తహసీల్దార్ పాండునాయక్, ఏఆర్ఐ అనిల్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

■ వెల్దండ మండలంలోని అజిలాపూర్, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనువాస్ ప్రారంభించారు. తహసీల్దార్ కార్తీక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐలు శంకర్‌నాయక్, శైలజ ఉన్నారు.

■ తిమ్మాజిపేట మండలంలోని ఎదిరేపల్లిలో రెవెన్యూ సదస్సుకు ఆర్డీఓ సురేష్ హాజరయ్యారు. ఎదిరేపల్లి, అప్పాజిపల్లిలో 20 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. తహసీల్దార్ రామకృష్ణయ్య, డీటీ జ్యోతి, ఎంఆర్‌పి రవిచంద్ర, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బల్మూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి విడతలో మండల వ్యాప్తంగా 518 మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ రాజేందర్, జిల్లా హౌజింగ్ పీడీ సంగప్ప, ఎంపీడీఓ రాఘవులు, తహసీల్దార్ శ్రీకాంత్, జిల్లా ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు కాశన్నయాదవ్, సుధాకర్‌గౌడ్, వెంకటయ్య, మైమూద్, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

నాగర్‌కర్నూల్: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని కోరుతూ మంగళవారం టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద డీఈఓ రమేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఇద్దరు పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ప్రైవేట్ పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. దీనికి డీఈఓ సానుకూలంగా స్పందించారు. అనంతరం డీఐఈఓ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటరమణను కలిసి ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు రాయితీతో కూడిన విద్యను అందించే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని వినతిపత్రం అందజేశారు. అబ్దుల్లా ఖాన్, రాజేష్ గౌడ్, ప్రదీప్, శ్రీనివాస్‌గౌడ్, జెమిని సురేష్, కపిలవాయి రాజు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

తెలకపల్లి: పేదలకు అండగా ఉంటామని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేశవులు గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని గట్టు నెల్లికుదురులో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, మండల కార్యదర్శి రవిందర్, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి అంజయ్య, మాజీ సర్పంచ్ రేవతమ్మ, నాగయ్య, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సంతకాలపై గిరిజనుల ఆగ్రహం

బల్మూర్: మండల కేంద్రంలో గత నెల 24న నిర్వహించిన ఉమామహేశ్వర రిజర్వాయర్ భూసేకరణ అవగాహన గ్రామసభకు పీసా కమిటీ సభ్యులు హాజరైనట్లు ఐటీడీఏ అధికారులు తప్పుడు సంతకాల చేయడంపై చెంచు గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ నిర్మాణంలో పీసా చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు నిబంధనలు తుంగలో తొక్కారని ఆరోపించారు. ఐటీడీఏ అధికారి లలిత మంగళవారం వచ్చి పీసా కమిటీ సభ్యులు గత నెల 24న గ్రామసభకు హాజరైనట్లు మినిట్ బుక్‌లో సంతకాల సేకరణకు రావడంపై వారు మండిపడ్డారు. తమ గ్రామంలో పీసా కమిటీనే ఎన్నుకోలేదని అలాంటిది మేము సంతకాలు ఎందుకు చేస్తామని చెంచులు ప్రశ్నించారు. గ్రామంలో ముందుగా టాంటాం చేయించి గ్రామసభ ద్వారా పీసా కమిటీని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారి చేసేది లేక రెండు రోజుల్లో సమాచారం ఇచ్చి గ్రామసభ ఏర్పాటు చేసి కమిటీని ఎన్నుకుంటామని వివరించారు.

నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి

చారకొండ: ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ ద్వార మండలంలో మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులకు (కేఎన్ఎం-1638)రకం వడ్లు 10 కేజీల బ్యాగులు, రెండు పాలెం పచ్చ జొన్న పీవైపీఎస్ రకం 3 కేజీల బ్యాగు ఒకటి చొప్పున పంపిణీ చేశారు. ఏఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త మహదేవప్ప, ఏఈఓలు అనూష, వంశీ, మహేశ్వరి, నాయకులు వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయులే కీలకం

కందనూలు: బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా విద్యా శాఖ, ప్రజ్వల స్వచ్ఛంద హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి డీఈఓ రమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే స్థాయికి బాలికలు ఎదిగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని, మైనర్ పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, శరీర పెరుగుదల మార్పులు, దాని పర్యావసనాల గురించి వివరించాలని సూచించారు. జీసీడీఓ శోభారాణి మాట్లాడుతూ ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే 1098, 100, 181, 1930 లాంటి టోల్ ఫ్రీ నంబర్స్‌ను ఉపయోగించాలన్నారు. శిక్షణలో లఘుచిత్రాల ద్వారా పవర్ పాయింట్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్, ఏఎంఓ షరీఫుద్దీన్, ప్రిన్సిపాల్ వేణు, కో-ఆర్డినేటర్ రాము, కేజీబీవీ, మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

స్వేరోస్ నాయకుల రాస్తారోకో

తెలకపల్లి: మండల కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాలలో ఒకేషనల్ కోర్సు ఎత్తేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ ఆరోపించారు. మంగళవారం కళాశాల ఎదుట స్వేరోస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఒకేషనల్ కోర్సులను ఎత్తేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేష్ ఘటన స్థలానికి చేరుకొని నాయకులను శాంతింపజేసి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో నాగేష్, విష్ణు, మోహన్, ధర్మరాజు, రాము, పరమేశ్వర్, మల్లేష్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు భూములు ఇవ్వాలని ఆర్డీఓకు వినతి

అచ్చంపేట రూరల్: మండలంలోని బక్కలింగాయపల్లి శివారులో ఉన్న చెంచుల భూములు చెంచులకే ఇవ్వాలని సీపీఐ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీఓ మాధవికి సీపీఐ ఆధ్వర్యంలో చెంచులతో కలిసి వినతిపత్రం అందజేశారు. 20 సంవత్సరాల కిందట చెంచులకు సంబంధించిన భూములను గిరిజన లంబాడీలకు కౌలుకు ఇచ్చారని, ఆ భూములు తిరిగి చెంచులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు మల్లేష్, హైకోర్టు అడ్వకేట్ సలీముద్దీన్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి లక్ష్మీపతి, చెంచులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుడిపై కేసు ఎత్తేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ పృథ్వీరాజ్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తేయాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఎస్పీ రౌండ్ టేబుల్ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. కేసు ఎత్తేయకపోతే బహుజనులంతా ఏకమై బహుజనుల ఆత్మగౌరవ సభ పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, నిజాం, నరేందర్, జయశంకర్, రాజశేఖర శర్మ, పిడికిళ్ల శ్రీను, శివప్రసాద్, కళ్యాణ్, విజయ్, విజయ్, దాస్, మోహన్‌రెడ్డి, మల్లన్న, ఈశ్వర్, రాంచందర్, బాలనాగులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

అచ్చంపేట రూరల్: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ఎంఈఓ కుర్చీకి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. శివప్రసాద్, అరవింద్, అరవింద్ పాల్గొన్నారు.

యథావిధిగా కొనసాగించాలి

నాగర్‌కర్నూల్: తమ గ్రామాన్ని తిమ్మాజిపేట మండలంలోని కొనసాగించాలని కోరుతూ మండలంలోని గొరిట గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. నూతన మండలాల ఏర్పాటు ప్రతిపాదనలో భాగంగా ఇటీవల గొరిట గ్రామాన్ని మంగనూరు మండలంలో చేర్చే ప్రతిపాదనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్య, వైద్య, రవాణా, ప్రభుత్వ సేవలు అన్నీ తిమ్మాజిపేట నుంచే పొందుతున్నామని పేర్కొన్నారు. మంగనూరు మండలానికి మారితే ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. గ్రామస్తుల ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని, గొరిట గ్రామాన్ని తిమ్మాజిపేట మండలంలోనే కొనసాగించాలని కలెక్టర్‌ని కోరారు. తగిన విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం



నాగర్‌కర్నూల్ రూరల్: హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్ నర్సింహా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పార్టీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కొర్ర శేఖర్, ఆనంద్, గోపిచారి, రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి

తాడూరు: ప్రజా ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ పిలుపునిచ్చారు. మండలంలోని గుంతకోడురు గ్రామ శాఖ మహాసభకు ఆయన హజరై మాట్లాడారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వార్ల వెంకటయ్య, నాయకులు కుతుబ్‌ద్దోని, లక్ష్మీపతి, ఖాజ, చంద్రయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

తిమ్మాజిపేట: ప్రజా సమస్యలపై నిరంతర పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం 18వ మండల మహాసభ నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పేదలకు 10లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. మండల కార్యదర్శి ఖాజమైనదీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, శివకృష్ణ, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

ఉప్పునుంతల: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఉప్పునుంతల మండల కాంప్లెక్స్ ఆవరణలోని కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ వద్ద స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మంజూరు పత్రాలు అందజేస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మారం రాకేష్, రాఘవేందర్‌ల వ్యాపార, వాణిజ్య సముదాయాలు రెండు నెలల కిందట జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయి రూ.లక్షల నష్టం వాటిల్లింది. తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ నాయకుడు, శ్రీశైలం మల్లికార్జున సత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ఆధ్వర్యంలో బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం బాధిత సోదరులు రాకేష్, రాఘవేందర్‌లకు రూ.1.07 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి విసన కర్రల చంద్రకుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుల్లపల్లి శ్రీధర్, జిల్లా కోశాధికారి శివ జగదీశ్వర్, బిళ్ల కంటి రవికుమార్, మాజీ ఎంపీటీసీ కల్మిచర్ల గోపాల్, ఉప్పు ఆంజనేయులు, మేడిశెట్టి సురేష్, దత్తాత్రేయులు, గుబ్బ కిషన్, నారాయణరాజు, గుగ్గిల శంకర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో ఆరు నెలలుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. గ్రామంలోని 10వ వార్డులో పైప్‌లైన్ నుంచి నీరు లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. లీకేజీ అయిన నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో నడిచేందుకు వీలులేకుండా బురదమయంగా మారింది. ఆరు నెలలుగా నీరు లీకేజీ అవుతున్నా అధికారుల పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



తెలకపల్లిలో రైతులకు జొన్న, వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

తెలకపల్లి: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్త అర్చన, ఏఓ నర్మద అన్నారు. మండలంలోని పెద్దురులో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంలో వేదికలో విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ భూములను విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. వరి, జొన్న విత్తనాలను 9 గ్రామాల రైతులకు అందించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై అవగాహన

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పములలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శైలజ పంటల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ జానకి రాం, ముజీబ్, బాలస్వామి, రవీందర్, అనిల్ మల్లేష్ రైతులు సురేందర్‌రెడ్డి వెంకటేష్, యాదగిరిరెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

లింగాల: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధ్యమని శాస్త్రవేత్త అఫిపా జహాన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం 'నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఖరీఫ్‌లో సాగు చేసే పలు రకాల పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వరి, జొన్న విత్తనాల పంపిణీ

బిజినేపల్లి: మండలంలోని 9 క్లస్టర్ విభాగాల్లో ఎంపిక చేసిన రైతులకు వరి, జొన్న విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ నీతి తెలిపారు. మంగళవారం మండలంలోని పాలెం రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్ఎన్ఆర్-15048 రకం వరి 48 సంచులు, పీవైపీఎస్-2 జొన్న 24 సంచులు మండల వ్యాప్తంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, ఏఈవోలు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

కోడేరు: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నాగజ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సస్యరక్షణ శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం పాలెం డాక్టర్ శైల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. మండలంలోని ఆదర్శ రైతులను ఎంపిక చేసుకొని వారికి వరి, జొన్న విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మధు, సువర్ణ, నవ్యభారతి, సంధ్యారాణి, పృథ్వీ, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాల బృందం ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సభ్యుడు శరణప్ప

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం వైద్యుడు శరణప్ప అన్నారు. మంగళవారం మండలంలోని గగ్గలపల్లి పల్లె ఆస్పత్రిని జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు సంరక్షణ, టీకా కరణ, జీవనశైలి వ్యాధులైన అధిక రక్తపోటు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా అందిస్తున్న మందుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న రికార్డులను, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసిన డేటాను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం డాక్టర్ విపిన్ కార్తీక్, పి గనిగేరు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రామ్ అధికారి డా. మంజుల వాణీ, పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి, డీపీఓ రేణయ్య, ఏఓ అనంత చారి, క్వాలిటీ మేనేజర్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.